# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

| ఆదివారం | 30 మార్చి , 2025 | పేజీలు :08 |
|---|---|---|


## పోరాటలతోనే హక్కులు సాధించుకుందాం




మెయిన్‌లో

# భక్తులతో పోటెత్తిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం

### అష్టముఖి కొనేరులో భక్తుల పుణ్య స్నానాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** శనివారం అమావాస్య సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద గల పవిత్ర అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరించడానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 4గంటలన ఉంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కరిణిలో స్నానాలు ఆచరించి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి బారికేడ్లు ఏర్పాటు చేయగా భక్తులు క్యూ లైన్లో నిలబడి దర్శనాలు చేసుకున్నారు. అష్టముఖి కోనేరు వద్ద భక్తుల సౌకర్యార్థం భద్రతా ఏర్పాట్లను ఆలయ సిబ్బంది, పోలీసులు, గ్రామస్తులు పర్యవేక్షించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ ప్రాంగణం, కోనేరు ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. శనివారం అమావాస్య అరుదుగా వచ్చే సందర్భంగా అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరిస్తే సర్వ పాపాలు తొలగుతాయని, శని దోషాలు హరింపబడతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పుష్కరిణిలో స్నానం ఆచరించేందుకు విచ్చేశారు. భక్తులు ఓం నమో నారాయనాయ అనే అష్టాక్షరీ మంత్రాన్ని జపిస్తూ కోనేరు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తుల దర్శనార్థం బారికేడ్లను నిర్మించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సుమారు 20వేల పై చిలుకు భక్తులు అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5గంటల వరకు భక్తుల తాకిడి కొనసాగింది. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు మహిళలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా పెద్ద ఎత్తున దుకాణ సముదాయాలు వెలిశాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే జిల్లా జడ్జి సునీత కుంచాల, బోధన్ కోర్టు జడ్జి సాయిశివ లు కోనేరులో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ని దర్శించుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సిఐ కృష్ణ, ఎస్సై వంశీ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో 50మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే నిజామాబాద్‌కు చెందిన వ్యాపారులు ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు సుమారు 8వేల మందికి అల్పాహారం, తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. అలాగే ఓ భక్తుడు భక్తుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ నాయకం రాములు, పలు ఆలయాల ఈఓ లు, మాజీ ధర్మకర్త మండలి సభ్యులు, గ్రామ యువకులు ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### 'శాతవాహన' క్యాంపస్‌లోనే ఇంజనీరింగ్

# కళాశాలను ఏర్పాటు చేయాలి

ఇంజనీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌కు తరలించవద్దు
ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీల డిమాండ్




మెయిన్‌లో

### ప్రజలకు మెరుగైన సేవల కోసమే

# ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం

అధికారులంతా జవాబుదారీతనంతో పని చేయాలి
రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు

మెయిన్‌లో



# కృత్రిమ మేధను సద్వినియోగం చేసుకోవాలి

### పాఠశాల విద్య సంయుక్త సంచాలకుడు సత్యనారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి** కృత్రిమ మేధ అనేది విద్యా రంగానికి వరమని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కృత్రిమ మేధ సహాయంతో బోధన, అభ్యాసన ప్రక్రియ నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుచూపుతో పనిచేస్తోందని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని సినిమా వాడ క్యాంపస్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే కృత్రిమ మేధ వాడకాన్ని ప్రవేశపెట్టడం అభ్యాసన ఫలితాలను మెరుగుపరిచే దిశగా గొప్ప ముందడుగు అని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సౌలభ్యాన్ని పూర్తిగా వినియోగించుకుని, చిన్నారులు ఆసక్తిగా నేర్చుకునేలా చేయాలి అని సూచించారు. అనంతరం మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ కృత్రిమ మేధ విద్యార్థులకు కొత్తగా నేర్చుకునే తీరును మెరుగుపరిచే అవకాశాన్ని కల్పిస్తుందని, అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మండల విద్యాధికారి మాలవీదేవి, మాస్టర్ ట్రైనర్ రాజగోపాల్, సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, సినిమా వాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, డిసిఇబి అసిస్టెంట్ సెక్రటరీ కుమారస్వామి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శృతి, ఉపాధ్యాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌కె న్యూటెక్ గనిని సందర్శించిన

# ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కె న్యూటెక్ గనిని తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సందర్శించారు. ఆయనతో పాటు కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీ నారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్, సభ్యులు గనిలో పనిచేస్తున్న ఉద్యోగులతో కలసి ముచ్చటించారు. అనంతరం గని ఆవరణలోని క్యాంటీన్‌లో అల్పాహారం చేశారు. కమిషన్ సభ్యులందరూ భూగర్భ గనిలోకి వెళ్లి పని పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు కమిషన్ చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ సంబంధిత కార్మికుల సమస్యల పరిష్కారానికి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాంను కలిసి చర్చిస్తామని, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గనిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎంతో కష్టపడి విధులు నిర్వర్తిస్తున్నారని, వారందరికీ ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం సత్యనారాయణ, ఏజిఎం రాజేందర్, డిజిఎం పి అరవింద రావు, గని మేనేజర్ స్వామి రాజు, ఎడిఎస్ఓ, ఎస్‌సి లైజనింగ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి, సంక్షేమ అధికారి పాల్ సృజన్ పాల్గొన్నారు.

# పండుగలు భారతీయ సంస్కృతికి ప్రతీకలు..

### ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి,



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు తెలుగువారి నూతన సంవత్సర ఉగాది ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులు పూజలు నిర్వహించి ఒకరినొకరు ఉగాది పచ్చడిని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉగాది అంటే అందరికీ గుర్తు వచ్చేది తెలుగువారి ముఖ్యమైన పండుగ తెలుగు సంవత్సరం ఈ రోజు నుంచి ప్రారంభమవుతుంది.పండుగలు భారతీయ సంస్కృతిలో భాగమని సంస్కృతి సాంప్రదాయాలు భారతదేశనికి పుట్టినిల్లని,ఈ వారసత్వ సంపదను భావితరాలను అందించాలని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# డాక్టర్ చంద్రిక అవినాష్‌కు డాక్టర్స్ ఎక్సెలెన్స్ అవార్డు




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణంలోని దేవిబాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల కూ చెందిన డాక్టర్ చంద్రిక అవినాష్ కు రాష్ట్ర స్థాయిలో డాక్టర్స్ ఎక్సెలెన్స్ అవార్డు గైనకాలజీ,ఇన్ఫర్టిలిటీ విభాగంలో ఎంపీ రఘునందర్ రావు.రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు తనకు రావడం చాలా సంతోషంగా ఉందని తనపై మరింత బాధ్యత పెరిగిందని తనని నిరంతరం ఆదరిస్తున్న తన అభిమానులకు పేషెంట్లకు,హాస్పిటల్ సిబ్బందికి డాక్టర్ చంద్రిక అవినాష్ ధన్యవాదాలు తెలిపారు.

# ఫైషన్ డ్రెస్సింగ్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

### అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఖాన్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్,మైనార్టీ వెల్ఫేర్,ఆధ్వర్యంలో మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ ట్రైనింగ్ కోర్సును ప్రారంభంచారు.ఈ కోర్సు మూడు నెలలు అంబేద్కర్ భవన్ లో నిర్వహించడం జరుగుతుంది.ఈ ట్రైనింగ్ లో 48 మహిళలు సెలక్షన్ అయినట్లు ముస్లిం ఏక్తా కమ్యూనిటీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ముజాహిద్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి మహిళ ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకుంటే సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ గా కుట్టుమషీన్ నేర్చుకొని మంచి ఆదాయం పొందగలుగుతారు.ప్రతి మహిళా నేర్చుకొని తమ యొక్క ప్రతిభను నిరూపించుకొని ఎవరిపై ఆధారపడకుండా తమ జీవితాన్ని నేరుగా కొనసాగిస్తారు.ప్రభుత్వ పథకాలలో ఏమైనా స్కీమ్స్ ఉంటే వాళ్లకు ప్రభుత్వం తరపునుంచి ఎన్నో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎండబ్ల్యూ ఆర్ మోహన్ సింగ్,మున్సిపల్ కమిషనర్,దిలాన్ ఈ గవర్నెన్స్ అండ్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ సిబ్బంది.ముస్లిం ఏక్తా కమ్యూనిటీ సోషల్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు స్థాపకులు షేక్ ముజాహిద్.బాబర్,జహీర్,సోసైటీ గౌరవ అధ్యక్షులు హబీబ్ అల్ జిలాని,వసీమ్ షకీల్ నిర్మల్ పట్టణ ఎంఐఎం అధ్యక్షుడు అజీం బిన్ యాహయ్య,మాజీ కౌన్సిలర్ సలీం,జఫర్,సొసైటీ ఉపాధ్యక్షుడు సాజీద్,ప్రధాన కార్యదర్శి అల్మాస్,అఫ్రోజ్ పాషా ఖాన్,అజార్,తదితర సభ్యులు ఉన్నారు

# చట్టం ఎవరికి చుట్టం కాదు..




**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద గత గురువారం మహారాష్ట్ర నుండి నిజామాబాద్ వెళుతున్నటు వంటి ఎద్దుల వాహనాలను ఆక్రమంగా అడ్డుకొని డ్రైవర్లు జావిద్ ఖాన్ జుబేర్ ఖాన్ లను బెదిరించడం జరిగిందని,లారీలో ఎడ్లు కాకుండా ఆవులను తరలిస్తున్నారని లారీ పైకి ఎక్కి చూస్తూ డ్రైవర్లను కొట్టడానికి వెళ్తూ భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులకు గురిచేశారని వీరిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఇచ్చోడ సీఐ భీమేష్,తెలిపారు.ఈ సందర్భంగా విలేకరులతో సిఐ మాట్లాడుతూ తరచూ హైవేలపై లారీలను ఆపుతున్నారని ఎవరు కూడా చట్టన్ని తమ చేతిలోకి తీసుకోవద్దనిఒ చట్టం ఎవరికి చుట్టం కాదని ఇలాంటి చర్యలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలుసుకోవాలన్నారు.జాతీయ రహదారి కాబట్టి వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించరాదని ఎవరికైనా అనుమానం.కలిగితే వెంటనే డయల్ 100కి,ఇచ్చోడ సిఐ 8712659936,నేరడిగొండ ఎస్సై 8712659947 కి సమాచారం అందించలని అన్నారు.

# పంచాంగ శ్రవణ పుస్తక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణానికి చెందిన నూకల పోశెట్టి గుప్త వ్రాసిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర భవిష్య దర్శిని పంచాంగ శ్రవణ పుస్తక ఆవిష్కరణ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గత 52 సంవత్సరాలు గా పంచాంగ శ్రావణ పుస్తకాన్ని ఆర్యవైశ్య కుటుంబం లో జన్మించి వ్రాస్తున్నందుకు,సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు.పంచాంగ శ్రావణం ద్వారా ప్రజలందరికి భవిష్యతు లో జరగబోయే పరిణామలను ముందుగా తెలియజేస్తున్నందుకు చాలా సంతోషమన్నారు.పోశెటి కి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రమణ రెడ్డి,మాజీ కౌన్సిలర్ మేడారం ప్రదీప్,పిఏ నాలం శ్రీనివాస్,పాకాల రాంచందర్ పాకాల ఫౌండేషన్ చైర్మన్.టీటీడీ మాజీ చైర్మన్ ఆమెడ శ్రీధర్,ఎఎంసీ మాజీ వైస్ చైర్మన్ లు శ్రీకాంత్ యాదవ్,కొప్పుల శ్రీధర్,రవి తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ,తహషిల్దార్ కార్యాలయాలలో సర్వర్ బిజీ..




**ప్రజాపక్షం/దిల్వార్పూర్ :** ఓ పక్క అధికారుల సాధారణ బదిలీలు ప్రజలకు శాపంగా మారితే,సర్వర్ బిజీతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సహాయం చేయడానికి ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం గడువు ఏప్రిల్ 5తో ముగియనుండగా,దరఖాసుదారులు ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు మీసేవ సెంటర్లకు వెళితే సర్వర్ బిజీ వస్తుండడంతో దరఖాస్తూ చేసుకోవడానికి కుదురుతుందో లేదో అని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.కొందరు దరఖాసుదారులు ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాల కొరకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుని మండల కార్యాలయాలకు వెళితే కొన్ని మండలాలలో మండల తహసిదార్లు మారడం,డొంగల్ రాలేదని చెబుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.నేడు ఆదివారం ఆపై రంజాన్ పండుగ ఇలా వరుసగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు వస్తుండడంతో ఇక ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాలు పొందటం ఎలా అంటూ ఆశావాహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా కొన్ని మండలాలలో పలువురు మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా దరఖాసుదారులకు శాపంగా మారిందంటూ ప్రజలు వాపోతున్నారు.ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా అర్హత గల ప్రతి లబ్దిదారుడికి రాజీవ్ వికాసం పథకాన్ని అందజేయాలని కోరుతున్నారు.గడువును పెంచడం, లేదా దరఖాస్తు నిరంతర ప్రక్రియగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# పౌరా దేవి పాదయాత్రకు రండి..



**ప్రజాపక్షం/నేరడిగొండ :** బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జా దవ్,ని గిరిజన లంబాడీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఆ యన నివాసంలో కలిసి లంబాడీల ఆరాధ్య దైవమైన పౌరా దేవి ,సేవాలాల్ ,భక్తుల పాదయాత్రను ఈ నెల 31న పారంభించడానికి రావాలని ఆహ్వానించారు.ఈ కఠోరమైన దీక్షలను ఆధ్యాత్మికతను సమాజానికి అందించడానికి మీ తోడ్పాటు ఇవ్వాలని కో రారు.ఈ కార్యక్రమంలో లైవ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేంద ర్,,మహందర్,అంబాజీ,తదితరులుపాల్గొన్నారు.

# రంజాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గ్రామ పంచాయతీ ఇఒ



**ప్రజాపక్షం/ముధోల్ :** ముస్లింల పవిత్ర పండుగైన రంజాన్ కొరకు గ్రామ పంచాయతీ ఆధ్యర్యంలో సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి అన్వర్ అలీ పేర్కొన్నారు.రంజాన్ రోజు ప్రార్థన చేసే స్థలమైన ఈద్గా పరిసర ప్రాంతాన్ని స్వచ్ఛత చేయించారు.ఈద్గా వద్ద పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తున్న స్వచ్ఛత పరిశీలిస్తూనే గ్రామంలో జరిగే పనులను పర్యవేక్షిస్తున్నారు.గ్రామ ప్రజల సమస్యల ఫిర్యాదులు అందగానే వెనువెంటనే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.ముఖ్యంగా ఎండాకాలం అయినందున ఎక్కడ నీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.అదేవిధంగా మురికి కాలువలను శుభ్రం చేయడం,చెత్తని సేకరించి డంపింగ్ యార్డ్ లకు తరలించడం జరుగుతోంది.గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు ఉగాది పండుగ ..



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మండలంలోని వాలేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉగాది గురించి విద్యార్థులకు ప్రత్యేక గురించి వివరిస్తూ ప్రధానోపాధ్యాయులు రాధిక మాట్లాడుతూ..నూతన సంవత్సర ఆరంభాన్ని సూచిస్తూ ఉగాది ఆసన్నమయ్యే వేళ భగవత్ కీర్తనలు పాడుకుంటు కాలక్షేపం చేసేవారన్నారు.ద్వారాలను తోరణాలతో అలంకరించాలి.తీపి,పులుపు,కారం,చేదు,ఉప్పు వగరు కలగలసిన పచ్చడిని ఆస్వాదించాలి.ఇందులో ఉపయోగించే పదార్థాలన్నీ ఆరోగ్యదాయకమే,ముఖ్యంగా వేపపూత శరీరంలో చేరిన క్రిములను నశింపచేస్తుందని ఆయుర్వేదం చెప్తుందన్నారు.జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలనేందుకు ప్రతీకగా షడ్రుచులతో మిశ్రితమైన ఉగాది పచ్చడి సేవిస్తారు.ఎలాంటి అనుభవం ఎదురైనా స్థిరచిత్తంతో ఎదుర్కోవాలనే హితబోధ ఇందులో ఉంది.దాన్ని ఆరగించేముందు ఉగాది రోజున మన శక్తికి తగ్గట్టుగా పూర్ణ కుంభదానం చేయడం శ్రేష్ఠం,వెండి,రాగి లేదా మట్టి పాత్రను నీళ్లతో నింపుతారు.అందులో గంధం,పూల,అక్షతలు,మామిడి,వేప,మోదుగ,నేరేడు,అశోర తదితన పత్రాల చిగుళ్లు వేసి పూజిస్తారు.ఆ కుండను గురువులకు కానీ పెద్దలకు కానీ ఇంటి పురోహితుడికి గానీ ఇచ్చి వారి ఆశీస్సులను పొందుతారన్నారు.ఉపాధ్యాయులు సోనియా,లక్ష్మ ణ్,కవిత విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**ప్రజాప్రక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా ప్రజలకు శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. తెలుగు నామాది నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సహాలు నింపాలని అభిలాషించారు. ఉగాది పండగను ఇంటిల్లిపాది ఆనందోత్సహాలతో జరుపుకోవాలన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని, అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలు ఆనందోత్సహాలతో జీవనాలు వెల్లదీయాలని ఆకాంక్షించారు.



## ఉత్తమ అవార్డు అందజేత..

**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని కో లూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పోస్టల్ బ్యాంకింగ్ అకౌంట్స్,ఇన్సూరెన్స్,ప్రజలకు అవగాహన కార్యక్రమాలు తదితర అంశాల్లో సమర్థవంతంగా పనిచేసిన రేషన్ డీలర్ కుల్కర్ని,శంకర్ కు శనివారం ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్ జిల్లా మేనేజర్ కళ్యాణ్, శ్రీనివాస్,చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందజేశారు.అవార్డు అందుకున్న రేషన్ డీలర్ శంకర్‌ను గ్రామ ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టి లావణ్యకు మాజీ జెడ్‌పిటిసి అభినందనలు

ప్రజాపక్షం/లక్ష్మణచందా : మండలంలోపి చామన్ పెల్లి గ్రామానికి చెందిన ఎన్‌టి లావణ్య తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేసి మహిళా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా విజయం సాధించడం మన మండలానికి ఎంతో గర్వకారణం,ఆమె అతి చిన్న వయసులోనే ఇంత విజయం సాధించడం చాలా గర్వకారణం అని తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు ఆధిరోహించి మండలానికి మరింత పేరు తీసుకురావాలని మండల ప్రజలందరి తరుపున తాజా మాజీ జెడ్పిటీసి ఓస రాజేశ్వర్ కృతజ్ఞతలు తెలుపడం జరిగింది.

# కళాకారుల గురించి మాట్లాడిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు రుణపడి ఉంటాం



**ప్రజాప్రక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సిర్పూర్, కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, మెదక్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలకు రుణపడి ఉంటామని నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి కర్క రమేష్, కోశాధికారి గణేష్‌లు అన్నారు. శనివారం నగరంలోని సుభాష్‌నగర్ ఆంనేజయులు స్టూడియోల నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ శాసనసమండలిలో కళాకారుల గురించి గళమెత్తడం సంతోషకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర ఎనలేనిదని, కళాకారులు లేని తెలంగాణ ఉద్యమం ఊహించలేమని, కళాకారుల ద్వారానే తెలంగాణ వచ్చిందని వారికి కళాశాధితులు ఉద్యోగాలు కల్పించాలని మాట్లాడటం గొప్ప విషయమన్నారు. అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని మాట్లాడటంతో జిల్లా నిరుద్యోగ కళాకారుల తరపున ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచిన గత ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ కళాకారులను మభ్యపెడుతూ ఏళ్లు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల పట్ల ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులపై దయ చూపాలని కోరా రు. తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాడబోయి ఆంజనేయులు, సంజీవ్, మహేందర్, గోపాల్, శ్రీధర్, స ద్గురు స్రవంతి, అహ్మద్, అశోక్, రవి, సంతోష్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..



**ప్రజాపక్షం/కద్లాల్ :**మండలంలోని కద్లాల్ గ్రామానికి చెందిన కొంగ్ర రాం రెడ్డి(39) మోటార్ సైకిల్ కి కారుతో ఢీకోట్టడం తో మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఎన్‌హెచ్ 44 రోడ్డుపైన టీఎస్18 ఎఫ్ 4965 నెంబర్ గల ఎలక్ట్రికల్ మోటర్ సైకిల్ పైన తోట నుండి తన గ్రామానికి తిరిగి వస్తుండగ టీఎస్ 09ఈకే 0129 నెంబర్ గల కారు డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి మోటార్ సైకిల్ కు ఢీకొట్టి అక్కడనుండి పారిపోయాడు.మృతుడితలకు బలమైన గాయం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.డాక్టర్ పరీక్షించి మార్గమధ్యంలోనే చనిపోయాడని తెలిపారు.శనివారం మృతుడి అన్న కొంగ్ర రాజారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేకరు సోన్ ఎస్ఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఖానాపూర్‌లో నారీ శక్తి స్పెషల్ డ్రైవ్..



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్‌లో మహిళా కానిస్టేబుళ్లు శ్రావణి,మల్లేశ్వరి నారీ శక్తిని ప్రదర్శిస్తూ విస్తృతంగా,పెట్రోలింగ్ నిర్వహించారు.ప్రజలకు భద్రత,క్రమశిక్షణపై అవగాహన కల్పిస్తూ,చట్టాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని వివరించా రు.మాస్కాపూర్ కేజీబీవీ,ఎంజేపీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో సమావేశమైన మహిళా బలగం,స్వీయరక్షణ,సైబర్ నేరా లు,మహిళా హక్కులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు.సోషల్ మీడియా మోసాలు,హారస్‌మెంట్‌పై ఎంత జాగ్రత్తగా ఉండాలో వివరించడంతో పాటు ఎవరైనా వేధించినట్లయితే పోలీసుల సహాయాన్ని ఎలా పొందాలో తెలియజేశారు.అంతేకాకుం డా,ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్య లు చేపట్టి,వాహన తనిఖీల్లో చురుకుగా పాల్గొన్నారు.హెల్మెట్ లేకపోతే జరిమానా,నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.మీ భద్రత మా బాధ్యత అంటూ ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చిన మహిళా పోలీసులు,ఇలాంటి చైతన్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.నేరరహిత సమాజం కోసం ప్రజల భాగస్వామ్యం అవసరమని,క్రమశిక్షణతో నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

# మహిళ హత్య కేసులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి

### తల్లిని వ్యభిచార రొంపిలోకి దింపుతుందనే హత్య చేసిన యువకుడు



**ప్రజాప్రక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ముబారక్‌నగర్ ప్రాంతంలో జరిగిన మహిళ హత్య కేసులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముబారక్‌నగర్ ప్రాంతానికి చెందిన కమల అనే మహిళ తన తల్లిని వ్యభిచార రొంపిలోకి దింపుతుందనే కక్ష్య పెంచుకున్న రాజేష్ అన్న యువకుడు ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులకు విచారణలో వెల్లడైంది. డ్రైవర్‌గా పని చేస్తున్న రాజేష్ అనే వ్యక్తి కమల ఇంటి పక్కనే ఉంటున్నారు. తన తల్లితో చెడు పనులు చేయించే ప్రయత్నం చేస్తుందని ప్రతికరం పెంచుకున్నాడు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం కమల అనే మహిళను బైపాస్ ప్రాంతానికి పిలిపించి ఇదే విషయంలో అక్కడ ఇద్దరికి వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన రాజేష్ అనే యువకుడు బండరాయితో కమలను హత్య చేసి మృతదేహంపై కవర్ కప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కారును అద్దెకు తీసుకుని ఆ కారులో మృతదేహాన్ని తీసుకెళుతుండగా పోలీసులకు దొరికిపోయాడు. దీంతో మహిళ హత్యకు సంబంధించిన విషయాలు విచారణలో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

## నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా 9సార్లెన్నికైన అల్లూరు మల్ల రెడ్డికి అమ్ ఆద్మీ పార్టీ అధ్వర్యంలో సన్మానం చేయడం జరిగిందని జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు.సేవ గుణంతో పనిచేయడం పట్లనే తొమ్మిది సార్లు ఎన్నిక కావడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో అబ్దుల్ సాధిక్,జహీర్ అహ్మద్,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు దేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి విఠల్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ని మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి జెండా ఆవిష్కరించారు. కీర్తి శేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు పావులూరి వెంకటేశ్వర రావు, హనుమంత రావు, బోధన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బొగుళ్ల వినోద్, వై. సత్యనారాయణ, మార్ని రాజా, ఎం. రవి కుమార్, డి.కృష్ణా రెడ్డి, సచిన్, వెంకటేష్, మద్దిపూడి శ్రీనివాస్, పెండెం సత్యనారాయణ, శివ, నరసింహులు, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ ఆఫీసర్స్ క్లబ్ ట్యాక్స్ చెల్లించిన క్లబ్ ప్రతినిధులు



**ప్రజాపక్షం/బోధన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాపర్టీ ట్యాక్స్ వడ్డీ పై వన్ టైం సెటిల్మెంట్ 90శాతం రాయితీ ని కల్పించింది. ప్రాపర్టీ టాక్స్ చెల్లించేవారు ఈ నెల 31వ తేది వరకు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలోని బోధన్ ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు ప్రభుత్వం కల్పించిన ప్రాపర్టీ ట్యాక్స్ వడ్డీపై 90శాతం రాయితీని వన్ టైం సెటిల్మెంట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెండింగ్‌లో ఉన్న 19లక్షల 99వేల 252రూపాయాల చెక్కును క్లబ్ అధ్యక్షుడు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో తో కలిసి క్లబ్ ప్రతినిధులు శనివారం బోధన్ మున్సిపల్ కమీషనర్ వెంకట నారాయణ కు బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రాపర్టీ ట్యాక్స్ వడ్డీపై 90శాతం రాయతీని వన్ టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## నివాస గృహాల పక్కనే ఇష్టారాజ్యంగా చెత్త

**ప్రజాపక్షం/ముత్తారం :** నివాస గృహాలకు సమీపానే రోడ్ల పక్కన ఇష్ట రాజ్యాంగ చెత్తా చెదారం, మద్యం సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, కోళ్ల వ్యర్థాల తో పాటు ఇతర వ్యర్థాలు పడవేయడంతో వాటి వల్ల వచ్చే దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని అధికారులు తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలోని ప్రధాన రహదారి సమీపాన ఉన్న కల్వర్టు వద్ద ఇష్ట రాజ్యాంగ చెత్తపారబోస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పల్లె ప్రగతిలో భాగంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డంపింగ్‌యార్డులు నిరుపయోగంగా మారుతున్నాయి. తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినా ఉపయోగం లేకుండా పోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎక్కడబడితే అక్కడ చెత్త పారబోయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 30 ఏళ్లు దాటిన వారికి బిపి, షుగర్ పరీక్షలు



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు అమరేందర్ ఆధ్వర్యంలో శనివారం పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో 30 సంవత్సరాలు దాటిన వారికి బీపీ, షుగర్(ఎన్ సి డి) పరీక్షలు నిర్వహించారు.ఈసందర్భంగా వైద్యుడు అమరేందర్ రావు మాట్లాడుతూ 30 సంవత్సరాలు దాటిన వారికి బిపి, షుగర్ పరీక్షలు ఏఎన్‌ఎంల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని గ్రామంలో 100 పైచిలుకు పరీక్షలు నిర్వహించడం జరిగిందని అలాగే మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రతీ నెల మందులను సకాలంలో పంపిణీ ఆస్పత్రి సిబ్బంది అయినా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సునీత, అంగన్వాడి టీచర్ రజిత, మధుమతి, ఆశ వర్కర్లు సరిత,సుజాత, తో పాటు తదితరులున్నారు.

## రోగులను నిలువునా దోచుకుంటున్న మెడికల్ షాప్‌లు



**ప్రజాపక్షం / నందిపేట్ :** రోగుల ప్రాణాలు కాపాడాల్సిన మందుల దుకాణాల వారు తమ ఇష్టారీతిగా ఎంఆర్‌పి పేరు చెప్పి జనరిక్ మందులు ఇస్తువారి ప్రాణాలతో ఆడుకుంటున్న సంఘటన నందిపేట్‌లో జరుగుతున్నాయి. మండల కేంద్రంలో పది వరకు మెడికల్ షాప్‌లు ఉంటే అయిదు వరకు వైద్య శాలలు ఉన్నాయి. రోజు వందలాది మంది రోగులు వైద్య శాలలకు చికిత్స నిమిత్తం వస్తారు. వచ్చే రోగులకు పరీక్షలపేరుతో ఒళ్లు గుళ్ళ చేస్తున్నా జిల్లా ప్రభుత్వ వైద్యాధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. రోగులు మందుల కోసం మందుల దుకాణాలకు వెళితే వారు ఇచ్చిన మందులు తీసుకోవాలి. ఎన్ని డబ్బులు ఇవ్వమంటే అన్ని డబ్బులు ఇచ్చుకోవాలి. కనీసం రసీదు ఇద్దరు. అడిగితే నీ ఇష్టం ఉంటే తీసుకో లేకుంటే దొరకవు అంటు దబాయింపు చేస్తున్నారని రోగులు ఆవేదన. కొన్ని మందుల దుకాణాలలో జనరిక్ మందులు ఇస్తు ఎంఆర్‌పి రేటు వసూలు చేస్తున్నారు. వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుంది. మండలంలో చిన్న, మధ్య తరగతి కుటుంబాల వారు మండల ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి నిలువు దోపిడికి గురవుతున్నారు. వీరి గురించి పట్టించుకొనే నాథులు లేరా... జిల్లా అధికారులు నాంకే వాస్తే తనిఖీలు చేస్తున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించాల్సిన అవసరముంది.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ మండల ఇన్‌ఛార్జికి సన్మానం



**ప్రజాపక్షం/కోటగిరి:** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని సామిల్ లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కోటగిరి మండల ఇన్‌ఛార్జి మహమ్మద్ జావేద్ అక్రమ్ కు శనివారం మండల కాంగ్రెస్ నాయుకలు ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి పూలమాలలతో జావేద్ అక్రమ్‌ను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల ఎంపీటీసీ సలీం, జిల్లా కంగ్రెస్ సెక్రటరి వహీద్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, కోటగిరి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఆనంద్, ఆయూబ్, హుస్సేన్ వాజీద్ సోయల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పరీక్షలో ఇన్స్పైర్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం / బాన్సువాడ** ఏకలవ్య ఒలంపియాడ్ ఐఐటి అకాడమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్తాయి ఒలంపియాడ్ ఐఐటి పరీక్షల్లో గాంధారి మండలంలోని సర్వాపూర్ ఇన్స్పైర్ బ్రిడ్జ్ స్కూలు విద్యార్థులు ఆశ్రాఫ్, జ్ఞానశ్రీలకు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రామకృష్ణ మఠ్ అధ్యక్షులు బోదయనంద విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఒలంపియాడ్ ఐఐటి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మారుమూల ప్రాంత విద్యార్థులు తమ ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు వినయ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూఢత్వంతో పరువు హత్య

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో జరిగిన హత్య ఘటన నేపథ్యంలో మృతుని తండ్రి పరుశరాములు గౌడ్ ను వారి ఇంటి వద్ద ఈరోజు సిపిఎం జిల్లా కమిటీ బృందం పరామర్శించి, సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కులం, కట్టుబాట్ల పేరుతో మూఢత్వంలో సాయికుమార్ ను హత్య చేశారని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత ఆధునిక సమాజం వైపు ప్రయాణిస్తున్న సమయంలో ఇంకా ఇలాంటి మూడ విశ్వాసాలు, కట్టుబాట్లు, సాంప్రదాయాల పేరుతో ప్రేమించుకున్న పాపానికి అత్యంత దారుణంగా హత్య చేయడం క్షమించరాని నేరమని సిపిఎం భావిస్తుందని,ఇలాంటి సంఘటన నతో సభ్య సమాజ సిగ్గుతో తలదించుకోవాలని, ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ప్రజల్లో చైతన్యం కల్పించే విధంగా ప్రభుత్వం అధికార యంత్రాంగం కృషి చేయాలని అన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని, డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్, నాయకులు మోదంపెల్లి శ్రావణ్, జిల్లాల ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మోర్తాడ్‌లో ప్రభుత్వ ఇఫ్తార్ విందు



**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ముస్లీం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు మోర్తాడ్ గ్రామంలోని పెద్ద మసీదు వద్ద శుక్రవారం రాత్రి ముస్లీం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున నాయకులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ డిప్యూటీ తహసీల్దార్ సుజాత, మోర్తాడ్ మండల పరిషత్ సూపరింటెండెంట్ మీసాల బ్రహ్మానందం, ఎస్సై విక్రమ్, పంచాయతీ కార్యదర్శి సైఫోద్దీన్, ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో అన్నదానం



**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## భర్తను కడతేర్చిన కసాయి భార్య

**ప్రజాపక్షం / బాన్సువాడ :** బాన్సువాడ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన అమృతం విఠల్‌ను కొల్లూరు సబ్‌స్టేషన్ దగ్గర్లోని బాన్సువాడ బీర్కూర్ ప్రధాన రహదారిపై చంపి పడవేశారు. మృతుడిని సోమేశ్వర్ నుండి నాగారం గ్రామానికి చెందిన అమృతం కాశవ్వతో ఇల్లరికం వివాహం జరగగా, గత ఐదు సంవత్సరాల నుండి భర్తతో దూరంగా ఉంటూ అక్రమ సంబంధం పెట్టుకొని భర్తతో దూరంగా ఉండడంతో ఇటీవల పంచాయతీ కూడా జరిగింది. అక్రమ సంబంధానికి అడ్డుగా వస్తున్నాడని భర్తవిఠల్‌ను మరొకవ్యక్తితో కలిసి హతమార్చి రోడ్డుపై పడవేశారు. మృతుడు విఠల్‌ను ఎక్కడ హతమార్చి పడవేశారో అట్టి సమాచారం తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిమిత్తం మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సిఐ అశోక్ తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే సాయం



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి కింద పడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో శ్రీనూకాంబిక జాతరకు వెళ్తున్న రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గాయపడిన యువకుడికి సాయం అందించారు. స్థానికుల సాయంతో యువకుడికి ప్రథమ చికిత్స అందించారు. 108 అంబులెన్సుకు ఎమ్మెల్యే ఫోన్ చేసి రప్పించడంతో యువకుడిని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్సకై తరలించారు. యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. సకాలంలో మానవత్వంతో ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ స్పందించడం పట్ల స్థానిక ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు బెల్లంపల్లి ఉచిత ప్రయాణం



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉచిత ఆటో సేవలు అందిస్తున్నామని బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్ట రాంకుమార్ తెలిపారు. గత మూ డు సంవత్సరాలుగా బెల్లంపల్లి పట్టణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఆటో సేవలు అందిస్తున్నామన్నారు. పట్టణంలోని 30 మంది ఆటో డ్రైవర్లు ఉచిత ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారని, రెండో తేదీ జరిగే పరీక్ష కోసం కూడా ఈ సేవ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి భారం లే కుండా స్కూల్, కాలేజీల వద్ద దించేందుకు ఆటో డ్రైవర్లు ముందుకు వస్తున్నామని పేర్కొన్నారు. చదువుకునే ప్రతి విద్యార్థికి మేము అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆటో యూనియన్ సభ్యులు, మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ల జెఎసి సభ్యులు పాల్గొన్నారు.

## దేవాపూర్ జమే మస్జీద్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు



**ప్రజాపక్షం/కాసిపేట :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ జమే మస్జీద్‌లో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ కొడప ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఫలహారాలు అందించి, వారి ఉపవాసాన్ని విరమింపచేశారు. ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపడుతున్నారని, మత సామరస్యాన్ని ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ గ్రామ ముస్లిం పెద్దలు, మస్జీద్ కమిటీ సభ్యులు, యువకులు, ఇతర విశిష్ట వ్యక్తులు పాల్గొన్నారు.

## మందమర్రి మున్సిపల్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



**ప్రజాపక్షం/ మందమర్రి :** మందమర్రి మున్సిపల్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ ఆధ్వర్యంలో శనివారం పాత బస్టాండ్ ప్రాంతంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఒక్కరోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ మందమర్రి మున్సిపల్ పాలకవర్గం లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, ప్రజలకు ప్రాథమిక సదుపాయాలు సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. మున్సిపల్ పాలకవర్గం లేకపోవడంతో సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోందని, ఎన్నికలు జరిగినట్లయితే ప్రజల అవసరాలు తీర్చేందుకు, అభివృద్ధి పనులకు వేగం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి, ప్రజలకు ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్‌టిపిపిలో ఎస్‌సి, ఎస్‌టిలకు హక్కుల ప్రకారం ఉద్యోగాలు కల్పించాలి



**ప్రజాపక్షం/ జైపూర్ :** ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులను అవమానిస్తే సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. శనివారం జైపూర్ పవర్ ప్లాంట్‌లోని సింగరేణి కార్యాలయంలో ఎస్‌టిపిపిలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సమస్యలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ మేక్ హెచ్‌ఆర్ వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టిలు కిందిస్థాయి ఉద్యోగాలకే పరిమితమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌టిపిపిలో సింగరేణి, పవర్ మేక్ వంటి సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టిలు ఎంతమంది ఉన్నారనే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ఉద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇచ్చి ఉన్నత ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సూచించారు. జిఒ నెం. 59 ప్రకారం భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల కుటుంబాలకు న్యాయం చేయాలని, వారి పిల్లలను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యత పవర్ ప్లాంట్ తీసుకోవాలని తెలిపారు. సిఎస్‌ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని, భూ నిర్వాసితుల పిల్లలకు కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పవర్ మేక్ హెచ్ ఆర్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగాల వివరాలను సమగ్రంగా తెలియజేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి పరిధిలోని నిరుద్యోగ యువత కోసం పవర్ ప్లాంట్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, ప్రధాన గేటు వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలనే వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ, సింగరేణి సి అండ్ ఎండితో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లోనూ అవమానించరాదని స్పష్టం చేస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిపిపి ఇడి శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా జిఎం శ్రీనివాస్,డిజిఎం పంతులనాయక్, ఎస్ఓటుఇడి ప్రభాకర్, ఎస్‌సి, ఎస్‌టి రాష్ట్ర కమిటీ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, లక్ష్మీ నారాయణ, ప్రవీణ్, శంకర్ పాల్గొన్నారు.

## పౌర హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



**ప్రజాపక్షం/తాండూర్ :** మండలంలోని గోపాల్ నగరం గ్రామపంచాయతీ పరిధిలో శనివారం జాతీయ పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అజాజోద్దిన్ పాల్గొని మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి అనేక హక్కులను కల్పించిందని, ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వినియోగించుకునేందుకు ప్రతి పౌరుడు అర్హుడేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో కుల, మత వివక్ష లేకు ండా అందరూ సమానంగా జీవించాలని, సమాజంలో సముచిత స్థానం కలిగి ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దాసు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాప్‌టాప్‌ల అందజేత



**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల, గర్ల్స్ పాఠశాలలు, శిశు మందిర్ పాఠశాలకు సేవా భారతి ఆధ్వర్యంలో కార్పొరేట్ సంస్థల సహకారంతో ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ప్రభుత్వ పాఠశా లలో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కల్పించేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు అందించామని సేవా భారతి ప్రతిని ధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో మరిన్ని ప్రభుత్వ పాఠశాలలకు ల్యాప్‌టాప్‌లు అందజేసి, విద్యార్థులకు కంప్యూటర్ విద్య నేర్పేందుకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు ల్యాప్‌టాప్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి ప్రతినిధులు రఘునాథ్ వెరబెల్లి, చోలేటి హరీష్, కిషన్ శాస్త్రి, రజనీష్ జైన్, మల్రాజ్ ఆనంద్ రావు, రవి శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఈస్‌గాం శివాలయంలో పంచాగ శ్రవణం

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో ఈనెల 30 ఆదివారం పంచాగ శ్రవణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమం వేద పండింతులు ముద్ద నరహరి శర్మ, దేవాలయ అర్చకులు ఇందారపు శర్మలచే జరుపబడుతుందని పేర్కొన్నారు. ఉదయం 9.45 గంటలకు నిర్వహించే పంచాగ శ్రవణ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



## కృత్రిమ అవయవాల పంపిణీ



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలిమెకో ఆధ్వర్యంలో, బిడిఎల్ సహకారంతో కాగజ్ నగర్ ఎం ఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్లు, కృత్రిమ కాళ్లు, కృత్రిమ చేతులు, వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎంఎల్ఎ డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ 100 మందికి పైగా దివ్యాంగులకు చేయూత అందించడం గర్వకారణమని, ఈ కార్యక్రమానికి సహకరించిన అలిమెకో, భార త డైనమిక్స్ లిమిటెడ్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వా మ్యులవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, బిడిఎల్, అలిమెకో సంస్థల ప్రతినిధులు, స్థానిక దివ్యాంగులు పాల్గొన్నారు.

## కుల వివక్ష నిర్మూలనకు కృషి

### తహసీల్దార్ సూర్య ప్రకాష్



**ప్రజాపక్షం/ తిర్యాని :** సమాజంలో ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో జీవించాలని, కుల వివక్ష నిర్మూలనకు అందరూ కృషి చేయాలని తహశీల్దార్ సూర్య ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం తిర్యాని మండలంలోని గోయాగాం గ్రామ పంచా యతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సూర్య ప్రకాష్, ఎంపిడిఒ మల్లేష్ మాట్లాడుతూ ఎవరైనా వివక్షకు గురైతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీలోని ప్రాథమిక సౌకర్యాల గురించి ప్రజలతో చర్చించి, వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, తాగునీటి సమస్య, రహదారి మరమ్మతులు, విద్యుత్ సౌకర్యాల నిర్వహణపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ వినయ్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, ఎఎస్ఐ నారా యణ, ఇతర నాయకులు, గ్రామ ప్రజలు, యువత ఉత్సాహంగా పాల్గొని సామాజిక సమానత్వం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

## విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దు

### మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకూడదని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సూచించారు. శుక్రవారం సెంట్ క్లారిటీ పాఠశాలపై తల్లిదండ్రుల ఆరోపణల నేపథ్యంలో శనివారం ఆయన పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్ బీజు జోసెఫ్‌ను విద్యార్థులను ఆరుబయట నిలబెట్టడంపై ప్రశ్నించగా, తాము ఎవరి విషయంలోనూ ఆ విధంగా ప్రవర్తించలేదని, అయితే దాదాపు 200 మంది విద్యార్థులు ఇప్పటికీ ఫీజులు చెల్లించలేదని, వారి తల్లిదండ్రులను వివరణ కోరామని తెలిపారు. మండల విద్యా ధికారి వాసాల ప్రభాకర్ విద్యార్థులను ఏ విధంగానూ బయట నిలబెట్టకుండా, ఫీజుల విషయమై తల్లిదండ్రులను ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో శుద్ధ నీటి ప్లాంటు, మరుగుదొడ్లను పరిశీలించారు.

## ఏప్రిల్ 4న ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ కాసిపేట :** మండలంలోని ముత్యం పల్లి రైతు వేదికలో ఏప్రిల్ 4న మెగా ఉచిత వైద్య పరీక్షలు, చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నారు అని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా వైద్య, వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభు త్వ ఆసుపత్రి వైద్యులు, మెడి లైఫ్ హాస్పిటల్ వైద్యులు కలిసి ఈ శిబిరంలో సేవలు అందించనున్నారని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని కోరారు. ఏప్రిల్ 4న ఉదయం 10 గంటలలోగా శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకో వాలని సూచించారు. శిబిరంలో సాధారణ వైద్య నిపుణులతో పాటు ఆర్థోపెడిక్, పిల్లల వైద్య నిపుణులు, ఇతర వైద్య రంగాల నిపుణులు సేవలు అందిస్తారని, పరీక్షలకు వచ్చే ప్రజలకు మంచినీటి సౌకర్యం మాత్రమే కల్పించనున్నట్లు తెలిపారు.

## శ్రీలక్ష్మి వెంకటనరసింహ స్వామి కళ్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ప్రజాపక్షం/చొప్పదండి: చొప్పదండి మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలో ఏప్రిల్ 1న జరిగే శ్రీలక్ష్మి వెంకట నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యంనుఆలయ నిర్వాహకులు శనివారం కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, మాజీ కౌన్సిలర్ పెరమాండ్ల గంగయ్య, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ కోలాపురి శ్రీకాంత్, ఆలయ అర్చకులు బైరి కృష్ణమూర్తి, దుంపల ఐలేందర్, మాజీ సర్పంచ్ మునిగాల సుధాకర్ గౌడ్, తోడేటి డేవిడ్, పరశురాములు పాల్గొన్నారు.

## పౌరహక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు



ప్రజాపక్షం/శంకరపట్నం : మండల పరిధిలోని మెట్పల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘం కమిటీ హాలులో శనివారం సంఘం ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ బత్తుల భాస్కర్ హాజరై మాట్లాడారు. సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగించరాదన్నారు. పౌరహక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కులవివక్ష , అంటరానితనాన్ని నిర్మూలించాలన్నారు. అన్ని కులాలు సోదర భావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణ ప్రసాద్, ఎంపిఓ ప్రభాకర్, ఏఎస్ఐ సుధాకర్, ఏపిఓ సుధాకర్, దళిత సంఘం నాయకులు భద్రయ్య, అంబేద్కర్, దళిత సంఘం నాయకులు భద్రయ్య, అంబేద్కర్ మండల అధ్యక్షుడు అంతడుపుల సతీష్, ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు శంకర్, బొజ్జ రవి, ఓదెలు, శ్రీనివాస్ తదితరులున్నారు.

### రాజీవ్‌యువ వికాస్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/చిగురుమామిడి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిని ఆర్థిక స్వావలంభన వైపు నడిపించేందుకు స్వయం సహాయ ప్రోత్సాహకాలను చేపట్టిందని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొత్తపెల్లి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## సన్నబియ్యం పంపిణీతో నిరుపేదల్లో సంతోషం



మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్

ప్రజాపక్షం/చొప్పదండి : నిరుపేదలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడంతో వారిలో సంతోషం తాండవిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ అన్నారు. నేటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేసే సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ బియ్యం తీసుకున్న పేదలు ప్రతి ఒక్కరూ కడుపునిండా భోజనం చేస్తారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోటాపోటీగా సుందరగిరి వారసంత వేలం



వేలంపాటలో పాల్గొన్న 34 మంది రూ.7లక్షలకు వారసంతను కైవసం చేసుకున్న పోరండ్ల రమేష్

ప్రజాపక్షం/చిగురుమామిడి : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో ప్రతి శుక్రవారం నిర్వహించే గొర్రెల, మేకల వారసంత టెండర్‌ను చిగురుమామిడి తహసీల్దార్, సుందరగిరి గ్రామ పంచాయతీ స్పెషలాఫీసర్ ముద్దసాని రమేష్ సమక్షంలో గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం బహిరంగ వేలంను నిర్వహించారు. ఈ సందర్భంగా వేలంపాటలో 34 మంది ఒక్కొక్కరు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.3 లక్షల 33 వేల 3 వందల నుంచి మొదలైన వేలం పాట పోటాపోటీగా ఎవరూ ఊహించని విధంగా రూ.7 లక్షలకు చేరుకుంది. పరకాలకు చెందిన పోరండ్ల రమేష్ రూ.7 లక్షలకు వారసంతను సంవత్సరం పాటు కైవసం చేసుకున్నారు. ఒక పశువుకు విక్రయదారుల నుంచి వంద రూపాయలు మాత్రమే తీసుకోవాలని అధికారులు సమావేశంలో వెల్లడించారు. వారసంత నిర్వహించే చోట లైట్లు, త్రాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని, వారసంతకు వచ్చే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వారసంత వేలం పాటను కైవసం చేసుకున్న రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రాజశేఖర్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్, తాజా మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన బిఆర్ఎస్ నేతలు

ప్రజాపక్షం/చొప్పదండి : చొప్పదండి మండలంలోని మల్లన్నపల్లె గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేతలు శనివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను వారి నివాసంలో కలిసి తెలుగు నూతన విశ్వావసు నామ సంవత్సరం శుభాకాంక్షలను ముందస్తుగా తెలియజేశారు. ఇందులో బిఆర్ఎస్వై నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భక్తు విజయ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి విద్యార్థి విభాగం దుర్గం గంగాధర్, ఫ్యాక్స్ మాజీ డైరెక్టర్ బండారి కొమురయ్య, మార్కెట్ మాజీ డైరెక్టర్ బండారి స్వామి, గ్రామశాఖ ఉపాధ్యక్షుడు జాడి చంద్రయ్య, సీనియర్ నాయకుడు బండారి తిరుపతి తదితరులున్నారు.



## ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు





ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలలో శనివారం ముందస్తుగా ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణాన్ని మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని ఉపాధ్యాయులందరూ తయారు చేయగా ఇంటి నుంచి పిండివంటలను తీసుకొచ్చారు. అంతకుముందు ఈ వేడుకలను మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు ఉగాది పచ్చడి అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కదారి సునీతరెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### విజ్ఞాన్ పాఠశాలలో ఉగాది సంబరాలు

ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ విద్యానగర్‌లోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల నిర్వాహకులు వీరయ్య తెలిపారు. విద్యార్థులందరికీ ఉగాది పండుగ విశిష్టతను తెలియజేశారు. పిల్లలందరూ సాంప్రదాయకరమైన దుస్తులు ధరించి ఉగాది పచ్చడి తయారు చేశారని తెలిపారు. విద్యార్థులకు ఉగాది పచ్చడి ప్రత్యేకతను తెలియజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్నకొండ జడ్పిహెచ్ఎస్‌లో ముందస్తు ఉగాది వేడుకలు

ప్రజాపక్షం/చొప్పదండి: చొప్పదండి మండలంలోని ఆర్నకొండ జడ్పిహెచ్ఎస్‌లో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠ శాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు కనిగంటి రాజమౌళి మాట్లాడుతూ విద్యార్థులకు ఉగాది పండుగ విశిష్టతను గురించి వివరించారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్, ఉమాదేవి, అనిత, లక్ష్మి, కిషన్, సిబ్బంది విజయలక్ష్మి, విద్యార్థులు తదితరులున్నారు.



## ముందస్తు ఉగాది సంబరాలు



ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్‌లోని రేకుర్తి, విద్యానగర్, తీగల గుట్ట పల్లిలలో గల సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ విద్యా సంస్థలలో ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు ముందస్తుగా నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ ఫా తిమా రెడ్డి మాట్లాడుతూ ఉగాది పచ్చడి నాడు షడ్రుచుల సమ్మేళనం తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలిసిన ఉగాది పచ్చడిని చిన్నారులు రంగురంగుల దుస్తులతో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఇంచార్జిలు సంగీత, సంధ్య, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలి



ప్రజాపక్షం/రామడుగు : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు రామడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జువ్వాజి హరీష్ అధ్యక్షతన భారత రాజ్యాంగ పరిరక్షణకై నిర్వహించే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర మండల సన్నాహక సమావేశం శనివారం షానగర్ గ్రామంలోని లక్ష్మి గార్డెన్‌లో నిర్వహించారు. జువ్వాజి హరీష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం, అంబేద్కర్ పట్ల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సహా బిజెపి నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై నిరసనగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిం దన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న, కోల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలున్నారు.

## ముల్కనూర్, మోడల్ స్కూల్‌లో ముందస్తు ఉగాది సంబరాలు



ప్రజాపక్షం/చిగురు మామిడి: చిగురుమామిడి మండలంలోని మోడల్ స్కూల్, ఆదర్శ పాఠశాలతో పాటు సుం దరగిరిలో ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. పాఠశాలను మామిడి తోరణాలతో పాటు బంతిపూలతో అలంకరించి ఉగాది పచ్చడి విద్యార్థులందరికీ రుచి చూపించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ మాట్లాడుతూ ఉగాది విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సుందరగిరి హెచ్ఎం గోనె శివరాం, టీచర్లు విజయలక్ష్మి, మంగ, సరళ, మహేశ్వరి,పాల్గొన్నారు.

### ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/శంకరపట్నం : మండల కేంద్రంతో పాటు మొలంగూర్ గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ అడహక్ కమిటీ కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు మోరె ప్రభాకర్ ఆధ్వర్యంలో స్వర్గీయ ఎన్‌టిఆర్ స్థాపించిన టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి ఎన్‌టి రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కదిరె కొమురయ్య, బైరి తిరుపతి, షబ్బీర్, విరమల్ల, సాగర్, తుమ్మ ప్రభాకర్, వెంకటపతి, బసంత్, దేవయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటికీ కాషాయ ధ్వజం పంపిణీ

ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ పట్టణంలోని 31వ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ నివాసి దేవసాని సరస్వతి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వస్తిశ్రీ విశ్వావసు తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా ప్రతి ఇంటికి కాషాయ ధ్వజం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, రాజేష్, శంకర్, రామారావు, పాపన్న, పవన్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నాంపల్లి శ్రీనివాస్, ఒబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిచెర్ల రాజు, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు అవదుర్తి శ్రీనివాస్, తిరుపతి తదితరులున్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

ప్రజాపక్షం/కోనరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఎలగందుల లవన్ కుమార్ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మసీద్‌లో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఎంసి డైరెక్టర్ వాల్యా నాయక్, దర్ర రవి, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నాగండ్ల భూమేష్, రాజశేఖర్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/బీర్పూర్ : జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలో స్థానిక ఎంఎల్ఏ సహకారంతో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధుల ద్వారా ఐదు లక్షల సిసి రోడ్ పనులకు వడ్డెర కాలనీలో రోడ్ నిర్మాణానికి తాజా మాజీ సర్పంచ్ పర్వతం రమేష్ శంకుస్థాపన చేశారు. కాలనీవాసులు స్థానిక ప్రజలు జగిత్యాల ఎంఎల్ఏ సంజయ్‌కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

## అడ్లూరికి మంత్రి పదవి కేటాయించాలి

ప్రజాపక్షం/బీర్పూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మరో ఆరు మంత్రి పదవులు భర్తీ చేయాలని చూస్తున్న నేపథ్యంలో మాదిగ జాతికి చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకి చెందిన మంచికి మారుపేరుగా నిలిచిన ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కి మంత్రి పదవి ఇవ్వాలని ఎంఆర్‌పిఎస్ బీర్పూర్ మండలశాఖ అధ్యక్షులు గోడిసెల మురళి ప్రభుత్వాన్ని కోరారు. తప్పకుండా ప్రభుత్వ స్పందించి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు పూదురి రాజేశం, గంగా రవి, పూదూరి నర్సయ్య, శేఖర్, బదినపెల్లి పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్ష సమావేశం

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా గ్రిడ్, మిషన్ భగీరథ పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి అంశాలపై చర్చించి తగు సూచనలు చేశారు.

## నరసింహస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి నీలిమ

ప్రజాపక్షం/బీర్పూర్ : జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని శుక్రవారం జగిత్యాల జిల్లా జడ్జి నీలిమ తన కుటుంబసభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ పక్షాన పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి శేషవస్త్రంతో సన్మానించారు.

## వాహనదారులు భద్రత నియమాలు తప్పనిసరి

కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు



ప్రజాపక్షం/ కాసిపేట : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలి, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం అలవాటుగా చేసుకోవాలి అని కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. శనివారం మండలంలోని కొండాపూర్ (యాప) వద్ద ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనాలను, నిబంధనలు పాటించని వాహనదారులను గుర్తించి జరిమానా విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లు గుర్తిస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించడంతో పాటు మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారికి జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు ఒకరి ప్రాణాలను మాత్రమే కాదు, ఆ కుటుంబాన్ని కూడా రోడ్డు పాలయ్యేలా చేస్తాయని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. గమ్యం చేరేవరకు కుటుంబాన్ని గుర్తించి బాధ్యతతో నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని, నిర్లక్ష్యం ఖరీదు కుటుంబం నిరాశ్రయత అని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అని ఎస్ఐ స్పష్టం చేశారు. ఈ వాహన తనిఖీల్లో కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం చట్టరీత్యా నేరం

సిఐ శశిధర్ రెడ్డి



ప్రజాపక్షం/మందమర్రి : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చట్టరీత్యా నేరమని మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం వంటి ఘటనలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శనివారం మందమర్రి సర్కిల్ కార్యాలయ ఆవరణలో మందమర్రి, కాసిపేట, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత వారం రోజులుగా నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసుల్లో పట్టుబడ్డ 42 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెరుగుతున్నాయని, మద్యం సేవించి వాహనం నడిపితే అదుపు కోల్పోయి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నదని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయడమే కాకుండా, డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కేసులు నమోదు చేయడమే కాకుండా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి చర్యలు కొనసాగుతాయని, మళ్లీ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట esi ప్రవీణ్, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, అదనపు ఎస్ఐ ఎన్. శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అవమానంతో భార్యను చంపిన భర్త..భర్త బలవన్మరణం

ప్రజాపక్షం/మల్యాల : భార్యను అవమానించిన ఓ భర్త...ఆమెను రోకలి బండతో తలపై కొట్టి చంపిన సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండల లంబాడీపెల్లి గ్రామం లో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మల్యాల మండలం లంబాడీపల్లి గ్రామానికి చెందిన సాధుల దుర్గయ్య అనేవ్యక్తికి రాజవ్వ అనే మహిళకు ముప్పై సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుర్గయ్య, వృత్తి రీత్యా వివిధ రాష్ట్రాల్లో బిక్షటన చేస్తు మూడు నెలల ఒకసారి తన గ్రామానికి వస్తుండేవాడు. గత కొంతకాలంగా తన భార్యపై అనుమానం పెంచుకున్న దుర్గయ్య తరచుగా గొడవ పడేవాడు. ఈ క్రమంలో పెద్ద మనుషుల మధ్య పంచాయితీలు జరిగాయి. అయిన కానీ అతనిలో మార్పు రాక పోగా ఎలాగైనాభార్యను చంపాలని కక్ష్య పెంచుకుని నిన్న మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తన భార్య తలపై రోకలి బండతో బలంగా కొట్టడంతో రాజవ్వ తలకు బలమైన గాయం కలిగి రక్తస్రావం కావడంతో అక్కడి నుంచి దుర్గయ్య పారిపోయాడు అనంతరం రాజవ్వను వాళ్ల కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో జగిత్యాల సివిల్ హాస్పిటల్‌కు తరలించగా అక్కడి డాక్టర్ల సూచన మేరకు కరీంనగర్‌లోని ఏషియన్ హాస్పిటల్‌లో చేర్పగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం చనిపోయింది. తను కొట్టడం వల్లే తన భార్య మృతి చెందిందని తన భర్త అయిన దుర్గయ్య తన ఇంటి దగ్గరలోని వీరయ్య గుడి సమీపంలోని జామ చెట్టుకు తన లుంగీతో ఉరి వేసుకొని చనిపోయాడని, కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని వెనుగుమట్ల గ్రామంలో శనివారం గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు .పశు వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు .ఈ శిబిరంలో పశువైద్యాధికారి తిరుపతి గ్రామంలోని పాడి పశువులకు సంబంధించిన వైద్య చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంతోష్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామాలలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామని ,పాడి రైతులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు .అనంతరం పశు వైద్యాధికారి తిరుపతి పశువులకు వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు రైతులకు సూచించారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి ,పశువైద్యాధికారి తిరుపతి ,ఇన్చార్జి మార్కెట్ కార్యదర్శి వరలక్ష్మి ,మార్కెట్ డైరెక్టర్ అనూష ,పంచాయతీ కార్యదర్శి సతీష్ ,మార్కెట్ సిబ్బంది ,పాడి రైతులు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు ఉగాది సంబరాలు

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్లేట్ హైస్కూల్లో శనివారం రోజు ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులు పలువురు రకాల వేషధారణలు సాంస్కృతిక నాటికలు, నృత్యాలు చేసి పలువురుని ఆకట్టుకున్నారు అదేవిధంగా మరికొంతమంది విద్యార్థులు జ్యోతిష్య కార్యక్రమం నిర్వహించిమిగిలిన విద్యార్థులకు జ్యోతిష్యం చెప్పారు. తదనంతరం పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి, డైరెక్టర్ తిరుపతిరెడ్డి, రాజ్యలక్ష్మి ,ఇంచార్జ్ మల్లికార్జున్ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

సిర్పూర్ ఎంఎల్ఎ డా. పాల్వాయి హరీష్ బాబు



ప్రజాపక్షం /కాగజ్ నగర్ : కాగజ్ నగర్ పట్టణంలోని ఎంఎల్ఎ నివాసంలో శనివారం మన్నెవార్, కొలవార్ సంఘం నాయకులు సిర్పూర్ ఎంఎల్ఎ డా. పాల్వాయి హరీష్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసి అసెంబ్లీలో తమ కులం సర్టిఫికెట్ సమస్యను ప్రస్తావించినందుకు ఎంఎల్ఎకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన్నెవారు, కొలవారు కులస్తుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుర్స పోచయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల రామస్వామి, కుర్మా రాజు, రాష్ట్ర కోశాధికారి సొల్లా బాపు, రాష్ట్ర యువజన అధ్యక్షులు దబ్బా గోపాల్, కొమురంభీం జిల్లా అధ్యక్షులు దబ్బా బాపు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్రి రూపేష్, కౌటాల మండల నాయిని సిద్దయ్య, టెకం వెంకటేష్, యువజన అధ్యక్షులు పూజారి సుగుణకర్, బెజ్జూర్ మండల అధ్యక్షులు మండిగే హన్మంతు, బూడిద భీంరావ్, చింతపూడి పోషన్న పాల్గొన్నారు.

## ముస్లిం కుటుంబాలకు పండ్ల పంపిణీ



ప్రజాపక్షం/కొత్తపల్లి: ముస్లిం కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. శాతవాహన లయన్స్ క్లబ్ గోల్డెన్ సభ్యులు రంజాన్ పండుగ సందర్భంగా రేకుర్తి కంటి ఆసుపత్రి సమీపంలో గల ముస్లిం కుటుంబాలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ రంజాన్‌లో భక్తి శ్రద్ధలతో ఉపవాసం చేసి అందరూ కలిసిమెలిసి ఉండాలని కోరారు. మంచి వాతావరణంలో పండుగ జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ మానువాడ శంకర్, కార్యదర్శి లయన్ నసువాల గిరిధర్ రావు, లయన్ ఎదుల్ల రాజశేఖర్, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ చిలుపూరి రాములు, డైరెక్టర్లు లయన్ గోనె చంద్రారెడ్డి, లయన్ ఆరెపల్లి సంపత్, యాకుబ్, హుస్సేన్, అబ్దుల్లా, ఇబ్రహీం, రఫీక్ తదితరులున్నారు.

## శ్రీవేదం ఉన్నత పాఠశాలలో ఉగాది ఉత్సవాలు




ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్‌లోని శ్రీవేదం ఉన్నత పాఠశాలలో ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేసి వాటి ప్రాముఖ్యతను ఎంతో చక్కగా వివరించారు. మరికొందరు విద్యార్థులు పంచాంగ శ్రవణం చేసి ఒక్కొక్కరి జాతక నక్షత్రం ప్రకారం ఆదాయ వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వేదం, శ్రీవేదం పాఠశాలలో చదువుతోపాటు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలపై ఎక్కువగా శ్రద్ధ చూపడం జరుగుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అధికారుల సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ : విధి నిర్వాహణలో అందరి మన్ననలు అందుకొని పదవీ విరమణ పొందిన ఎస్ఐ మన్సూర్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ గంగరాజం ని శాలువా పూలమాలలతో ఘనంగా సత్కారించి జ్ఞాపికను అదనపు ఎస్పి శ్రీ భీమ్ రావు అందజేశారు. జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అదనపు ఎస్పీ హాజరయ్యి, మాట్లాడారు. సుమారు 40 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఎస్ఐ మన్సూర్ఖాన్, 36 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన హెడ్ కానిస్టేబుల్ గంగరాజం ల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తు వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణు, పదవి విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.